

# పాపులర్ రచనలు చేయటం ఎలా?

## యండమూరి వీరేంద్రనాథ్

(క్రిందటిసంచిక నుంచి తరువాయి)

*శైలిలో ప్రాస - లయ*

పాఠకుడిని పుస్తకం విడవకుండా చదివించేది సస్పెన్స్ అయితే పాఠకుడి హృదయం నిండా సంతృప్తిని నింపేది కథలో ఉన్న థీం. అయితే, పాఠకుడు - పుస్తకం పట్ల, రచయిత పట్ల ఆప్యాయత పెంచుకునేది కేవలం శైలివల్లే.

సులభమైన శైలిలో అందంగా వ్రాయగలగడం ఒక రకంగా రచయిత అదృష్టం. అయితే దీన్ని సాధించవచ్చు. చదువుతున్నంతసేపు ప్రతీ వాక్యమూ లయబద్ధంగా కదులుతూ ఉంటే, అది తనకు తెలియకుండానే పాఠకుడికి ఒక రకమైన హాయి నిస్తుంది. ప్రతీ వాక్యమూ ఛందోబద్ధంగా వ్రాయనక్కర్లేదు గానీ, లయబద్ధంగా మాత్రం వ్రాయవచ్చు.

ప్రతిదీ పొయిట్రీ కానవసరంలేదు. కానీ, ఒక అందమైన దృశ్యాన్ని మరింత అందంగా వర్ణించవలసి వచ్చినప్పుడు, ఈ రకమైన పొయెటిక్ ప్రాస బావుంటుంది.

అతడిని ఆమె మొదటిసారి చూసింది. **"చూడగ - కేవలం చూస్తూనే ఉండాలనిపించక - కదలగ - కదిలి దరి చేరాలనిపించక మదనుని శరజడి - నడుమున అలజడి -"** అంటాడు రచయిత.

ఈ రకమైన ప్రాస కొన్ని కొన్ని చోట్ల బావుంటుంది.

"అతడు బిందువయ్యాడు. ఆమె వృత్తమయ్యింది. పడక దీర్ఘచతురస్రమయింది. నిద్ర సుదూర తీరాలకు పారిపోయింది."

చెప్పదలచుకున్న విషయాన్ని ఇలా చెప్పటం.... ముఖ్యంగా, సెక్స్ సీన్స్‌లో బాగా ఉపయోగపడుతుంది. పచ్చి శృంగారం కన్నా, ఈ విధమైన శృంగారం మామూలు పాఠకుల్నే కాకుండా విజ్ఞులైన పాఠకుల్ని కూడా ఆకట్టుకుంటుంది.

శైలిలో లయ - ప్రాస - యతి - కేవలం రచయిత యొక్క సామర్థ్యం వల్ల, కృషి వల్ల, పుస్తకాలు చదవటం వల్ల వస్తుంది. ఎక్కువగా దాని గురించి వివరించటం అనవసరం.

*పాఠకులతో సంభాషణ*

అవును. రచయిత తన రచన ద్వారా పాఠకులతో సంభాషించవచ్చు. కేవలం అక్షర విన్యాసం ద్వార అతడు తను చెప్పదలుచుకున్న విషయాన్ని పాఠకుల మనసులోకి మరింత స్పష్టంగా చొప్పించవచ్చు.

పదాల్ని విరవటం ద్వారా, అక్షరాల మధ్య చుక్కలు పెట్టడం ద్వారా, ఆశ్చర్యార్థకాలు పెట్టడం ద్వారా సంఘటనని పాఠకుల కళ్ళకి కట్టినట్టు చూపించవచ్చు.

ఈ క్రింది సంఘటన చదవండి.

*పార్కులో పట్టుబడ్డ అబ్బాయినీ, అమ్మాయినీ తేరిపార చూసాడు ఇన్‌స్పెక్టర్. 'అమ్మాయ్ నీ వయసెంత?'*

*"ప........... పదిహేడు" సమాధానమిచ్చింది.*

*"అంటే మైనర్‌వన్నమాట" అంటూ, అబ్బాయి వైపు తిరిగి, "మైనర్‌తో కలిసి పార్కులో రొమాన్సు చేసినందుకు, రేప్ కేస్ క్రింద అరెస్ట్ చేస్తున్నాను" అన్నాడు.*

*"నాకేం తెలీదు సర్! నేను రోడ్డు మీద వెళుతుంటే ఈ అమ్మాయే చేయి ఊపి పిలిచింది" అన్నాడు అబ్బాయి*

*"న్నో..." అంటూ అరిచింది ప్రీతి.*

*"నిజం సార్ నన్ను నమ్మండి" అన్నాడా అబ్బాయి.*

*ప్రీతి కళ్ళనీళ్ళతో అతడివైపు చూసింది. అ....యి...పో...యింది..... తన జీవితం సర్వనాశనమయింది. తనిప్పుడొక వేశ్య! వేశ్య!! వేశ్య!!*

ఈ విధంగా ఒక సంభాషణలో కేవలం చుక్కల ద్వారానూ, 'నో' అన్న మామూలు అక్షరాన్ని బలంగా వత్తు ఇవ్వటం ద్వారానూ, స్పష్టీకరించటంలోనూ ఆ సంఘటనలో నాటకీయత తీసుకురావచ్చు.

తులసీదళం పాఠకులకి క్లైమాక్స్ గుర్తుండే ఉంటుంది.

విలన్‌ని చేతులు కట్టి కూర్చోబెట్టి పైన కుండలో నీళ్ళు పోస్తారు. ఒక్కొక్క చుక్క పడుతున్నప్పుడు 'టప్' మని చప్పుడవుతుంది. కాలం గడిచే కొద్దీ విలన్ తాలూకు మానసిక సంచలనాన్ని –

టప్

**టప్**

**టప్**

**టప్**

**టప్**

అని అక్షరాలు పెద్దవి చేసుకుంటూ పోవడం ద్వారా అతనెంత భయంకరంగా ఆ శబ్దాన్ని అనుభవిస్తున్నాడు అనే విషయాన్ని తెలియచెప్పటం జరిగింది.

సస్పెన్స్ హారర్ నవలల్లో భాషని ఈ విధంగా వ్రాయటం ద్వారా ఎక్కువ ఎఫెక్ట్ సాధించవచ్చు. కిర్ర్ర్ర్......... ఉష్ష్ష్, లాంటివి ఇలాంటి ప్రయోగాలే.

*<u>శైలి ద్వారా నాటకీయత</u>*

రెండు పాత్రలు మాట్లాడుకునేటప్పుడు రచయిత తన శైలి కాకుండా ఆ పాత్ర స్వభావాన్ని అనుసరించి వ్రాయాలి.

పల్లెటూరి కుర్రాడూ, పట్నం కుర్రాడూ మాట్లాడుకుంటూ ఉంటే సంభాషణ అంత స్వభావసిద్ధంగా జరగాలి. ఒక తల్లీ కూతురూ, భార్యా భర్తా మాట్లాడుకుంటున్నప్పుడు కూడా సంభాషణ వారి వారి మానసిక స్థాయిని బట్టే ఉండాలి. చాలామంది వర్ధమాన రచయితల్లో ఇది లోపిస్తుంది. అన్ని సంభాషణలూ రచయిత పరంగానే వ్రాయడం మంచిది కాదు.

అదే విధంగా సంభాషణల్లో నాటకీయత ఉండవలసి వచ్చినప్పుడు, లేదా ఒక బలమైన మెలో డ్రమెటిక్ సంఘటన వ్రాయాల్సి వచ్చినప్పుడు ఆ సంభాషణ ఎంత నాటకీయంగా ఉంటే అంత బావుంటుంది.

ధ్యేయం అనే నవలలో ఈ సంభాషణ గమనించండి.

"నీకూ మా అవినాష్‌కి ఏమిటీ సంబంధం?" సూటిగా ఉపోద్ఘాతమేదీ లేకుండా అడిగాడు.

అతనలా ప్రశ్నించేసరికి ఆమె బిత్తరపోయింది. క్షణంలో తేరుకుని నవ్వుతూ "నేను మిమ్మల్ని 'అంకుల్' అని చిన్నప్పటినుండీ పిలుస్తున్నాను. ఏ సంబంధంతో అంకుల్?" అంది.

అతని మొహం ఎర్రబారింది " నా కొడుకుని పెళ్ళి చేసుకోవాలనే ఉద్దేశ్యం నీకు చిన్నప్పటినుంచీ ఉంది. అందుకేగా అంకుల్ అని పిలిచావ్?"

ఆమె అదే చిరునవ్వుతో "మీ అబ్బాయి కూడా మా నాన్నగారిని అలాగే పిలిచేవాడంకుల్!" అంది.

"షటప్!" అన్నాడు శంకరం. "మేం చిన్నప్పటినుంచీ మా అబ్బాయిని కష్టపడి పెంచాము. ఇప్పుడు నువ్వు గద్దలా వచ్చి తన్నుకు పోవటం భావ్యం కాదు."

నిఖిత కూడా అంతే సౌమ్యమైన గొంతుతో "ప్రతీ తల్లితండ్రులు తమ పిల్లల్ని కష్టపడే పెద్ద చేస్తారంకుల్!" అంది.

"నీకు పొగరు అని నా భార్య చెబితే నమ్మలేదు."

"పొగరుకీ, ఆత్మాభిమానానికీ చాలా తేడా ఉంది."

.........నాటకీయమైన సంభాషణలు ఈ రకంగా సాగుతాయి.

లేడీస్ హాస్టల్ అనే నవల్లో ఒక అమ్మాయి ఆత్మహత్య చేసుకుంటుంది. ఆ కేసు పరిశోధిస్తూ హీరోయిన్ రాయలసీమలో ఉన్న ఒక పల్లెటూరికి వెళుతుంది. చచ్చిపోయిన అమ్మాయి తాలూకు తండ్రి అక్కడుంటాడు. తన కూతురు హాస్టల్‌లో ఆరుబైట ఎవరితోనో రొమాన్స్ చేస్తూ ఉండగా తండ్రి చూసి, తన పల్లెకు తిరిగి వచ్చేస్తాడు. పరిశోధన చేస్తున్న అమ్మాయి అతడి దగ్గరకి వెళ్ళేసరికి అతను మానసికంగా 'బ్రేక్' అయి విపరీతంగా దుఃఖిస్తాడు.

అప్పుడతనంటాడు "ఆకాశమంత పందిరివేసి నా కూతురి పెళ్ళి చేద్దామనుకున్నానమ్మా. కానీ ఆరుబైట ఆకాశం క్రిందే నా కూతురు పెళ్ళికాకుండా శోభనం జరుపుకుంటుంటే ఈ పాపిష్టి కళ్ళతో చూడాల్సి వచ్చింది" అని.

దీన్ని మెలో డ్రామా అంటారు. ఈ రకమైన మెలో డ్రామా రచనకి ఎంతో ఉపయోగపడుతుంది. అయితే తగినంత సామర్ధ్యం వచ్చేవరకూ రచయితలు దీని జోలికి పోకుండా ఉంటే మంచిది. లేకపోతే అప్పుడప్పుడు అభాసుపాలు కాక తప్పదు.

ఏది ఏమైనా ఒక నాటకీయమైన సంఘటన గానీ, సంభాషణ గానీ వచ్చినప్పుడు విశిష్టమైన శైలి ద్వారా పాఠకుల్ని ఆకట్టుకునే ఛాన్సు రచయితకు లభిస్తుంది. రచయిత ఎప్పుడూ దాన్ని వదులుకోగూడదు.

**వాక్యం క్రింద వాక్యం.**

ఈ మధ్య కొంతమంది రచయితలు నవలల్లో పేజీలు నింపటానికి సీరియల్ ఎక్కువకాలం నడపటానికి వాక్యం క్రింద వాక్యం వ్రాయటం అనే టెక్నిక్‌ని ఉపయోగిస్తున్నారు.

అతడు కదిలాడు.

అతడితోపాటు ఆమెకూడా నడవసాగింది.

అతడు వెనుతిరిగి, "నా వెనుకే ఎందుకొస్తున్నావ్?" అనడిగాడు.

"నా ఇష్టం." అంది.

సోడాలమ్ముకునే కుర్రవాడు వీళ్ళని చూసుకుంటూ ముందుకు సాగిపోయాడు.

అతడు తిరిగి నడక ప్రారంభించాడు.

వెనకే ఆమె నడవసాగింది.

ఈ విధంగా వాక్యం క్రింద వాక్యం వ్రాయటంద్వారా ఎక్కువ పేజీలు పెరగొచ్చు తప్ప పాఠకుడికి సంతృప్తి మిగలదు. అవసరం వచ్చినప్పుడు తప్పనిసరిగా ఇలా వ్రాయాల్సిందే కానీ ఇటువంటి అవసరం రచయితకి ఎప్పుడోగాని కలుగదు. ఏదయినా మంచి వాక్యం వ్రాసి ఆ వాక్యం పాఠకుడి దృష్టిలో తప్పకుండా పడాలి అనుకున్నప్పుడు మాత్రం ఈ విధంగా వ్రాయొచ్చు. లేదా ఒక సంఘటనలో బాగా టెన్షన్ సృష్టించవలసి వచ్చినప్పుడు ఈ విధమైన నిర్మాణం బావుంటుంది.

రచయిత ఒక మంచి వాతావరణాన్ని వర్ణిస్తున్నప్పుడు, లేదా ఒక సంఘటనని వివరిస్తున్నప్పుడు పెద్ద పేరాగ్రాఫ్‌తో మొదలుపెట్టడం ఎప్పుడూ మంచి పద్ధతి. అదే విధంగా సంభాషణ ఒక పాత్ర ద్వారా ప్రారంభమైతే, కదలికల్ని కూడా అదే పేరాగ్రాఫ్‌లో పూర్తి చేయాలి.

"నువ్వు రేపు సాయంత్రం బయలుదేరతావా?" అన్నాడు సుధాకర్.

కాగితం మీద కలంతో అడ్రస్ వ్రాసి ఆమె కిచ్చాడు. "అవును రేపు సాయంత్రం బయలుదేరుతున్నాను."

పై సంభాషణలో కొంత కృత్రిమత్వం కనబడటం లేదూ! అదే సంభాషణని ఈ విధంగా వ్రాయాలి.

"నువ్వు రేపు సాయంత్రం బయలుదేరుతున్నావా?" అంటూ, కాగితం మీద ఎడ్రస్ రాసిచ్చాడు.

"అవును, రేపు బయలుదేరుతున్నాను." అన్నదామె.

ఈ విధంగా అవసరమైన చోట పేరాగ్రాఫ్‌లు విడగొట్టడం ద్వారా రచనకి సంపూర్ణత్వం లభిస్తుంది.

ఈ విషయమై మరికొన్ని వివరాల్ని తరువాతి అధ్యాయం "శిల్పం"లో తెలుసుకుందాం.

వచ్చే సంచికలో.. శిల్పం